నేడు బోనాలపై సమీక్ష సమావేశం

రాంగోపాల్‌పేట్: వచ్చే నెల 21, 22వ తేదీల్లో జరుగనున్న సికింద్రాబాద్ ఉజ్జయినీ మహంకాళి అమ్మవారి బోనాల జాతర సమీక్షా సమావేశం గురువారం ఉదయం 8 గంటలకు నిర్వహిస్తున్నామని ఈవో గుత్త మనోహర్‌రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమానికి దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ, హైదరాబాద్ ఇన్‌చార్జ్ మంత్రి పొన్నం ప్రభాకర్, స్థానిక ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్ హాజరై జాతర ఏర్పాట్లపై సమీక్షిస్తారన్నారు.

విలీనం ప్రక్రియ త్వరగా పూర్తి చేయండి



ఎమ్మెల్యే శ్రీగణేష్ ను కలిసిన వికాస్ మంచి సభ్యులు

కంటోన్మెంట్: సికింద్రాబాద్ కంటోన్మెంట్ ప్రజలు దీర్ఘకాలంగా ఎదురుచూస్తున్న జీహెచ్‌ఎంసీలో కంటోన్మెంట్ విలీన ప్రక్రియను త్వరితగతిన పూర్తి చేయాలని కంటోన్మెంట్ వికాస్ మంచ్ సభ్యులు ఎమ్మెల్యే శ్రీగణేష్‌ను కోరారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల ఉన్నత అధికారులు విలీన ప్రక్రియను ప్రారంభించినందుకు హర్షం వ్యక్తం చేశారు. విలీనం పట్ల రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చొరవ, ఎమ్మెల్యే శ్రీగణేష్ పట్టుదలను అభినందిస్తూ శాలువాతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో సీపీఎం అధ్యక్షుడు గడ్డం ఏబుల్, ప్రధాన కార్యదర్శి సంకీ రవీందర్, ఎలగంటి ప్రభు గుప్తా, అంబాల శ్రీనివాస్, మహమ్మద్ ఫసివుద్దీన్, అరుణ్ యాదవ్, శివ కుమార్ పాల్గొన్నారు.

ఉద్యోగులకు ఇంజినీరింగ్ కోర్సుల్లో ప్రవేశాలు

ఉస్మానియా యూనివర్సిటీ: డిప్లొమా కోర్సులతో ప్రభుత్వ, ప్రైవేటు ఉద్యోగాలు చేస్తున్న అభ్యర్థులకు ఓయూ ఇంజినీరింగ్ కోర్సుల్లో ప్రవేశాలకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నారు. ఓయూ క్యాంపస్ కాలేజీతో పాటు ఐదు ప్రైవేటు అనుబంధ కళాశాలల్లో సివిల్ ఇంజినీర్‌తో పాటు మెకానికల్, ఎలక్ట్రికల్, ఐఎంఎల్ కోర్సుల్లో ప్రవేశాలకు జులై 21న నిర్వహించనున్నారు. వచ్చే నెల 7 వరకు దరఖాస్తులను స్వీకరించనునట్లు కోర్సు కన్వీనర్, ఓయూ ఇంజినీరింగ్ కాలేజీ ప్రిన్సిపల్ ప్రొ.చంద్రశేఖర్ తెలిపారు. ప్రవేశ పరీక్షలో అర్హత సాధించిన అభ్యర్థులకు ఆగస్టులో రిజర్వేషన్లతో కౌన్సెలింగ్ ద్వారా బీఈ, బీటెక్ ద్వితీయ సంవత్సరంలో నేరుగా ప్రవేశాలు కల్పించనున్నట్లు వివరించారు. మరిన్ని వివరాలకు 9866695963 నంబర్‌ను సంప్రదించాలన్నారు.

పద్మారావునగర్‌లో ఉచిత కంటి వైద్య శిబిరం



పద్మారావునగర్: సికింద్రాబాద్ పద్మారావునగర్‌లో బుధవారం ఉచిత కంటి వైద్య శిబిరాన్ని నిర్వహించారు. పుష్పగిరి కంటి ఆసుపత్రి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన శిబిరంలో అనేక మందికి కంటి పరీక్షలు నిర్వహించారు. కళ్ల విషయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలను గురించి ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆసుపత్రి సిబ్బంది మాట్లాడుతూ.. కళ్ల విషయంలో ప్రజలు ఎంతో జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. చల్లని నీటితో కళ్లను శుభ్రం చేసుకోవడం ద్వారా ఎలాంటి ఇన్‌ఫెక్షన్లు సోకవన్నారు. ఈ కార్యక్రమంలో యశ్వంత్, సునీల్, త్రివేణి తదితరులు పాల్గొన్నారు.

డిగ్రీ కాలేజీల్లో గెస్ట్ లెక్చరర్స్‌ను కొనసాగించాలి

ఉస్మానియా యూనివర్సిటీ: ప్రభుత్వ డిగ్రీ కాలేజీల్లో పని చేస్తున్న గెస్ట్ లెక్చరర్స్‌ను విధుల్లో కొనసాగించాలని విద్యాశాఖ ముఖ్య కార్యదర్శి బుర్ర వెంకటేశంకు బుధవారం వినతి పత్రం ఇచ్చారు. రాష్ట్రంలోని 135 డిగ్రీ కాలేజీల్లో పని చేస్తున్న 1940 గెస్ట్ లెక్చరర్స్‌ను కొనసాగించడంతో పాటు పరీక్షల విధులు, జవాబు పత్రాల మూల్యాంకణానికి అనుమతి ఇవ్వాలని విజ్ఞప్తి చేసినట్లు తెలంగాణ డిగ్రీ లెక్చరర్స్ ఫోరం వ్యవస్థాపక అధ్యక్షులు డాక్టర్.సీహెచ్ కిశోర్ కుమార్ తెలిపారు. విద్య సంవత్సరం ప్రారంభమైనందున బోధన విధులకు గెస్ట్ లెక్చరర్స్‌కు అనుమతించాలన్నారు.ఈ కార్యక్రమంలో భార్గవిగౌడ్, పి.ధనలక్ష్మీ, తదితరులు పాల్గొన్నారు.

నిర్మాణ భవనం పైనుంచి పడి కార్మికుడికి గాయాలు


చిలకలగూడ: నిర్మాణ భవనం పైనుంచి కిందపడి కార్మికునికి తీవ్ర గాయాలైన ఘటన చిలకలగూడ ఠాణా పరిధిలో జరిగింది. పోలీసుల వివరాల ప్రకారం.. సీతాఫల్‌మండి డివిజన్ శ్రీనివాసనగర్‌లో ఐమాత ఆలయానికి సంబంధించి ఓ భవనాన్ని నిర్మిస్తున్నారు. నిర్మాణ పనులు జరుగుతుండగా బుధవారం మధ్యాహ్నం కార్మికుడు మురళీ (35) ప్రమాదవశాత్తు కిందపడి గాయాలకు గురయ్యాడు. తోటి కార్మికులు, భవన నిర్మాణ యజమానులు సికింద్రాబాద్‌లోని ఓ ఆస్పత్రిలో చేర్పించి చికిత్స అందిస్తున్నారు. కేసు దర్యాప్తులో ఉంది.

కాఫీతో సందడి చేసిన నటి అనన్య



సాక్షి, సిటీబ్యూరో: నగరంలోని అమీర్‌పేట్ వేదికగా ప్రముఖ సినీతార అనన్య నాగళ్ల సందడి చేసింది. అమీర్‌పేట్ మెట్రో పక్కన వాసవి ఎంపీఎం గ్రాండ్ వేదికగా నూతనంగా ఏర్పాటు చేసిన కోయంబత్తూర్ ఫిల్టర్ కాఫీ ప్రీమియం కేఫ్‌ను బుధవారం నటి అనన్య నాగళ్ల ప్రారంభించారు. ఈ సందర్భంగా అనన్య మాట్లాడుతూ.. తనకు ఫిల్టర్ కాఫీ అంటే చాలా ఇష్టమని, సిటీలో మొదటి ప్రీమియం కేఫ్‌ను ప్రారంభించడం సంతోషంగా ఉందని అన్నారు. వినూత్నమైన కోయంబత్తూరు ఫిల్టర్ కాఫీ రుచి హైదరాబాదీ కాఫీ ప్రియులను సంతృప్తి పరుస్తుందని ఆమె పేర్కొన్నారు. కోయంబత్తూర్ ప్రీమియం కేఫ్ మోడల్‌ను.. కాఫీని ఆస్వాదించే నగరంలోనే ఆవిష్కరించాలనే లక్ష్యంతో దీనిని ప్రారంభించామని వ్యవస్థాపకులు–సీఈఓ గోలి గోపి తెలిపారు. ఈ కేఫ్‌లో ప్రీమియం కాఫీ, ఫిల్టర్ కాఫీ, టీ, స్నాక్స్, మిల్క్‌షేక్‌ల తదితర ఐటమ్స్ అందుబాటులో ఉంటాయన్నారు.

నివాళి



సనత్‌నగర్: బేగంపేటకు చెందిన బీఆర్‌ఎస్ పార్టీ నాయకుడి కుటుంబాన్ని మాజీ మంత్రి, సనత్‌నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్ పరామర్శించారు. బేగంపేటలోని శ్యాంలాల్ బిల్డింగ్ ప్రాంతానికి చెందిన సీనియర్ నాయకుడు యాదగిరిగౌడ్ ఈ నెల 17న మరణించగా, బుధవారం జరిగిన శ్రద్ధాంజలి కార్యక్రమానికి ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్ హాజరై యాదగిరి చిత్రపటానికి నివాళి అర్పించారు. శ్రీహరి, నరేందర్, శ్యాంసుందర్ ఉన్నారు.

కాపుకాసి కత్తులతో దాడి

మేన కోడలిని ప్రేమిస్తున్నాడని బాల్య స్నేహితుడి హత్య | ఆరుగురు రిమాండ్





ఉస్మాన్(ఫైల్)

సనత్‌నగర్: మేన కోడలితో ప్రేమ వ్యవహారం నచ్చని ఓ యువకుడు బాల్య స్నేహితుడిని దారుణంగా హత్య చేసిన ఘటన బేగంపేట పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. బుధవారం తన కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో నార్త్‌జోన్ డీసీపీ సాధన రష్మీ పెరుమాళ్ కేసుకు సంబంధించిన వివరాలను వెల్లడించారు. బేగంపేట ఓల్డ్ పాటిగడ్డకు చెందిన షేక్ ఉస్మాన్ (20), మహ్మద్ ఎజాజ్ (26) చిన్ననాటి స్నేహితులు. ఇరువురు ఒకే బస్తీలో పక్క పక్కనే నివాసముంటున్నారు. ఉస్మాన్ ఏడాది కాలంగా ఎజాజ్ మేన కోడలు నేహను ప్రేమిస్తున్నాడు. రెండు నెలల క్రితం ఈ విషయం ఎజాజ్‌కు తెలియడంతో తన మేన కోడలితో మాట్లాడొద్దని ఉస్మాన్‌ను మందలించాడు. ఈ క్రమంలో కుటుంబ సభ్యులు నేహకు పెళ్లి సంబంధాలు చూడడం మొదలు పెట్టారు. ఈ విషయం తెలుసుకున్న ఉస్మాన్ ఆమెకు వచ్చే పెళ్లి సంబంధాలను చెడగొట్టేందుకు నేహ పేరిట ఫేక్ స్నాప్‌చాట్ అకౌంట్ తెరిచి ఫేక్ సంభాషణలను పంపిస్తూ ఆమెకు వచ్చే సంబంధాలను చెడగొడుతూ వస్తున్నాడు. ఇదిలా ఉండగా మంగళవారం సాయంత్రం ఎజాజ్ ఇంట్లో లేని సమయంలో ఉస్మాన్, అతని సోదరుడు హుస్సేన్, తల్లితో ఎజాజ్ ఇంటికి వచ్చి నేహకు పెళ్లి సంబంధాలు చూడడంపై కుటుంబ సభ్యులతో గొడవ పడ్డారు. నేహను పెళ్లి చేసుకోకపోతే తన కుమారుడు చనిపోతాడంటూ ఉస్మాన్ తల్లి వారితో వాగ్వాదానికి దిగింది. విషయం తెలుసుకున్న ఎజాజ్ వారిపై మరింతా కక్ష పెంచుకున్నాడు.

నిందితుల్లో మైనర్..

ఎలాగైనా ఉస్మాన్‌ను చంపేయాలని నిర్ణయించుకుని ఓల్డ్ పాటిగడ్డ ప్రాంతానికే చెందిన మహ్మద్ ఫిరోజ్ (24), సాహిల్‌ఖాన్ (19), మహ్మద్ ఫజల్ (20), బోయిన్‌పల్లి హస్మత్‌పేటకు చెందిన ఎండీ.రషీద్ (18)తో పాటు మరో మైనర్‌తో కలిసి ఉస్మాన్ కోసం తన ఇంటి సమీపంలోనే మంగళవారం రాత్రి కాపు కాసారు. రాత్రి 11.40 గంటలకు తన సోదరితో కలిసి హోండా షైన్‌పై వస్తుండగా స్థానిక గణేష్ మండపం వద్దకు రాగానే ఉస్మాన్‌బైక్‌ను ఆపి పక్కకు లాక్కెళ్లి తమ వెంట తెచ్చుకున్న కత్తులతో పొట్ట, మెడపై పొడిచి పరారయ్యారు. ఉస్మాన్ తీవ్ర రక్తస్రావంతో అక్కడికక్కడే మృతి చెందాడు. ఉస్మాన్ కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు. ప్రత్యక్ష సాక్షులు ఇచ్చిన సమాచారం మేరకు ఐదుగురిని అదుపులోకి తీసుకున్నారు. టాస్క్‌ఫోర్స్ పోలీసులు సైతం ఈ కేసులో తమ సహకారాన్ని అందించారు. అయితే.. ఉస్మాన్‌కు ప్రాణహాని ఉందని తాము ముందే చెప్పామని పోలీసులు స్పందించి ఉంటే ఈ హత్య జరిగేది కాదని ఉస్మాన్ కుటుంబ సభ్యులు పేర్కొన్నారు.



వివరాలు వెల్లడిస్తున్న డీసీపీ సాధన రష్మీ పెరుమాళ్

'తులం బంగారం' హామీని అమలు చేయాలి



చెక్కులను అందిస్తున్న ఎమ్మెల్యే తలసాని

రాంగోపాల్‌పేట్: ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన కల్యాణలక్ష్మి, షాదీ ము బారక్ లబ్ధిదారులకు తులం బంగారం హా మీని అమలు చేయాలని మాజీ మంత్రి, ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్ అన్నారు. బుధవారం సికింద్రాబాద్ తహసీల్దార్ కార్యాలయంలో కల్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ లబ్ధిదారులకు మంజూరైన చెక్కులను అందించి మాట్లాడారు. పేద, మధ్యతరగతి కుటుంబాలకు ఆర్థికంగా మేలు చేయాలనే ఉద్దేశంతో తెలంగాణ ప్రభుత్వం పేదింటి ఆ డపడుచుల పెళ్లిళ్ల కోసం ఈ పథకాలను ప్రవేశపెట్టిందన్నారు. అర్హులైన వారికి ఈ పథకంతో పాటు తులం బంగారం ఇస్తామని కాంగ్రెస్ పార్టీ ఎన్నికల్లో హామీ ఇచ్చిన విషయా న్ని గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ పాండు నాయక్, కార్పొరేటర్లు చీర సుచిత్ర, మహేశ్వరి, కుర్మ హేమలత, మాజీ కార్పొరేటర్ ఆకుల రూప పాల్గొన్నారు.

ప్రమాణస్వీకారం



ప్రమాణ స్వీకారం చేస్తున్న సభ్యులు

చిలకలగూడ : చిలకలగూడ కట్టమైసమ్మ నల్ల పోచమ్మ ఆలయ నూతనంగా ఏర్పాటైన ధర్మకర్తల మండలి సభ్యులు పదవి బాధ్యతలు చేపట్టారు. ఆలయ ప్రాంగణంలో బుధవారం జరిగిన కార్యక్రమంలో దేవాదాయశాఖ ఇన్‌స్పెక్టర్ ఆండాళ్, ఈఓ మహేందర్‌గౌడ్ నూతన కమిటీ సభ్యులతో ప్రమాణ స్వీకారం చేయించారు. కమిటీ చైర్మన్‌గా గుంటి కృష్ణ, సభ్యులుగా అమృత్, దేవేందర్ యాదవ్, జగన్‌రెడ్డి, శ్రీనివాస ముదిరాజ్, జానకీ, ధరమ్‌వీర్, ఎక్స్‌అఫీసియో సభ్యుడిగా ఆలయ ప్రధాన అర్చకులు తిరుమలాచార్యులు బాధ్యతలు స్వీకరించారు. కాంగ్రెస్ కంటెస్టెడ్ ఎమ్మెల్యే ఆదం సంతోష్ కుమార్ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. సికింద్రాబాద్ నియోజకవర్గంలో పదేళ్ల తర్వాత ఆలయ కమిటీలను ఏర్పాటు చేసినట్లు వివరించారు. నియోజకవర్గ పరిధిలో అన్ని ఆలయాలకు ట్రస్ట్ బోర్డులను త్వరలోనే ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. సెవెన్‌హిల్స్ బిల్డర్ కుంచాల ఏడు కొండలు, కాంగ్రెస్ డివిజన్ అధ్యక్షులు అభిషేక్, రవికుమార్, నాయకులు జలంధర్‌రెడ్డి, సందీప్‌రాజ్, అమర్‌గౌడ్, షకీల్‌ఖాన్, శంకర్ పాల్గొన్నారు.

'డబుల్' ఇళ్ల నిర్మాణం చేపట్టాలి

లాలాపేట: తార్నాక మున్సిపల్ డివిజన్ పరిధి లాలాపేట చంద్రబాబునగర్‌లో వెంటనే డబుల్ బెడ్రూమ్ ఇళ్ల నిర్మాణం చేపట్టాలని బస్తీ వ్యవస్థాపక అధ్యక్షులు కోళ్ల వెంటేష్ యాదవ్ డిమాండ్ చేశారు. బుధవారం ఆయన జీహెచ్‌ఎంసీ డిప్యూటీ మేయర్‌తో చర్చించారు. తెలంగాణ రాష్ట్రం ఆవిర్భావం నుంచి ఇక్కడి ప్రజలు ఇళ్ల కోసం ఎదురు చూస్తున్నారని పేర్కొన్నారు. దాదాపు వందల కుటుంబాలు ఇళ్లు లేక వర్షాకాలంలో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. ఈ విషయంపై డిప్యూటీ మేయర్ సానుకూలంగా స్పందించినట్లు కోళ్ల వెంకటేష్ యాదవ్ తెలిపారు.

రైల్వేస్టేషన్‌లో గుర్తు తెలియని యువకుడి మృతి



మృతుడు

అడ్డగుట్ట: అనారోగ్యంతో గుర్తు తెలియని యువకుడు మృతి చెందిన ఘటన సికింద్రాబాద్ రైల్వే స్టేషన్‌లో చోటు చేసుకుంది. హెడ్ కానిస్టేబుల్ డేవిడ్ రాజ్ వివరాల ప్రకారం.. సికింద్రాబాద్ రైల్వే స్టేషన్ ప్లాట్‌ఫాం నెం–7లో మంగళవారం సుమారు 25–28 సంవత్సరాల మధ్య వయస్సున్న గుర్తు తెలియని యువకుడు అపస్మారకస్థితిలో పడి ఉన్నాడు. గమనించిన రైల్వే పోలీసులు వెంటనే గాంధీ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. అనారోగ్య సమస్య కారణంగానే యువకుడు మృతి చెంది ఉంటాడని మృతుడు ఎరుపు రంగు ఫుల్ షర్ట్, బ్లూ కలర్ ప్యాంట్ ధరించినట్లు పోలీసులు తెలిపారు.

తాగునీటి గోస తీరుస్తా.. పక్కా ఇళ్లు కట్టిస్తా

సాక్షితో కంటోన్మెంట్ ఎమ్మెల్యే శ్రీగణేశ్



కంటోన్మెంట్: సికింద్రాబాద్ కంటోన్మెంట్ నియోజకవర్గంలో ఏళ్ల తరబడి అభివృద్ధికి దూరంగా ఉంది.. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నిర్లక్ష్యం, స్థానిక నాయకత్వం అలసత్వంతో కనీస మౌలిక సదుపాయాలకు కూడా నోచుకోలేని దుస్థితికి చేరింది. ఈ నేపథ్యమే తాను రాజకీయాల్లోకి రావడానికి బలమైన కారణమైందని అంటున్నారు కంటోన్మెంట్ ఎమ్మెల్యే శ్రీగణేశ్. 15 ఏళ్లుగా కంటోన్మెంట్ ఎమ్మెల్యే కావాలన్న ఆకాంక్ష ఎట్టకేలకు తీరిందని, ఈ గెలుపు తన బాధ్యతను మరింతా పెంచిందంటున్నారు. ముఖ్యంగా తనకు అవకాశం ఇస్తే నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తానంటూ చెప్పుకొచ్చిన మాట నిలబెట్టుకునే సమయం వచ్చిందన్నారు. ఇప్పటి దాకా ఓ లెక్క ఇప్పటి నుంచి మరో లెక్క అన్న స్థాయిలో నియోజకవర్గాన్ని ఆదర్శంగా తీర్చిదిద్దుతానని స్పష్టం చేశారు. కంటోన్మెంట్ ఉప ఎన్నికల్లో విజయం సాధించి ఎమ్మెల్యే గెలుపొంది నారాయన్ శ్రీగణేశ్ 'సాక్షి'తో పలు విశేషాలు పంచుకున్నారు.

పట్టాలు, పక్కా ఇళ్లకు ప్రాధాన్యం

నగరంలోని ఏకైక ఎస్సీ నియోజకవర్గమైన కంటోన్మెంట్‌లో నిరుపేదలు అధిక సంఖ్యలో ఉన్నారు. రక్షణశాఖ, పౌర విమానయాన శాఖలకు చెందిన స్థలాల్లో వేల సంఖ్యలో పేదలు నివాసముంటున్నారు. వీరికి పట్టాలు ఇస్తామంటూ ఏళ్ల తరబడి నేతలు మాటలు చెప్పడం మినహా ఒక్క అడుగు ముందుకు పడలేదు. కొన్నేళ్ల క్రితం ఈ స్థలాల్లోని నివాసాలు ఉన్న వారికి కంటోన్మెంట్ బోర్డు ఎన్నికల్లో ఓటు హక్కును కూడా తొలగించారు. ఈ అంశంపై వారి తరపున పోరాటం చేశా. ఇప్పుడు వారికి భూబదలాయింపు కింద పట్టాలు ఇస్తామని హామీ ఇచ్చాం. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, రెవెన్యూ గృహ నిర్మాణ శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి సహకారంతో త్వరలోనే ఈ సమస్యకు పరిష్కారం చూపుతాం.కంటోన్మెంట్ పరిధిలో గత ప్రభుత్వ హయాంలో డబుల్ బెడ్ రూమ్ ఇళ్లు కట్టినప్పటికీ, లబ్ధిదారుల ఎంపికలో పలు అవకతవకలు జరిగినట్లు ఆరోపణలు వచ్చాయి. ఈ అంశంపై ప్రత్యేక దృష్టి సారించి, అర్హులైన వారందికీ ఇళ్లు ఇప్పిస్తా. కంటోన్మెంట్‌లో సుమారు 6 వేల మందికి ఇందిరమ్మ ఇళ్లు ఇప్పించేందుకు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నాం.

విలీనంతోనే సమస్యలకు చెక్

కంటోన్మెంట్ ప్రాంతంలో మిలటరీ అధికారుల పాలనతో నిరుపేదలకు ప్రయోజనాలకంటే ఆంక్షలే అధికంగా ఉన్నాయి. తాగునీరు, డ్రైనేజీ, రోడ్లు, వీధి దీపాలు వంటి మౌలిక సదుపాయాలకు సైతం మిలటరీ అధికారుల దయాదాక్షిణ్యాలపైన ఆధారపడాల్సిన దుస్థితి నెలకొంది. కంటోన్మెంట్ ప్రాంతాన్ని జీహెచ్‌ఎంసీలో విలీనం చేయడం వల్ల ఆయా సమస్యలన్నింటికీ శాశ్వత పరిష్కారం లభిస్తుంది. కొందరు స్థానిక నేతలు తమ స్వార్థ ప్రయోజనాల కోసం విలీనానికి అడ్డుపడుతూ ఉన్నారు.త్వరలోనే రాష్ట్ర ప్రభుత్వం తరపున విలీనానికి అనుకూలంగా కార్యాచరణ కూడా మొదలుపెడతాం.

నీటి ఎద్దడి రానివ్వను..

కంటోన్మెంట్ ప్రజలకు తాగునీటి సరఫరా విషయంలో గత ప్రభుత్వం ద్వంద్వ వైఖరి అవలంభిస్తూ వచ్చింది. నగరమంతా ఉచిత మంచి నీటి పథకం అమలు ప్రారంభించిన, ఏడాది తర్వాత నుంచి ఇక్కడ అమలు చేస్తున్నారు. పెరిగిన జనాభా అవసరాలకు అనుగుణంగా నీటి సరఫరా మోతాదును పెంచాలంటే అదనంగా కనెక్షన్ చార్జీల పేరిట కోట్లాది రూపాయలు చెల్లించాలని సూచించినట్లు బోర్డు అధికారులు తెలిపారు. ఈ విషయాన్ని ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లి అదనపు భారం లేకుండా చూడటంతో పాటు నియోజకవర్గ వ్యాప్తంగా తాగునీటి ఎద్దడి లేకుండా చేస్తా.

విద్య, వైద్యాన్ని మెరుగుపరుస్తా

కంటోన్మెంట్‌లో కొన్ని పాఠశాలల దుస్థితి అత్యంత దారుణంగా ఉంది. గతంలో శ్రీగణేశ్ ఫౌండేషన్ ద్వారా కొంత మేరకు సాయం అందించాం. ఇప్పుడు ఎమ్మెల్యేగా అన్ని పాఠశాలల్లో పూర్తిస్థాయిలో మౌలిక సదుపాయాల కల్పనకు కృషి చేస్తా. ఇక వైద్య సదుపాయాలు కూడా అంతంత మాత్రంగానే ఉన్నాయి. బస్తీ దవాఖానాలు, పట్టణ ఆరోగ్య కేంద్రాలను పెంచుతాం. బొల్లారంలోని టిమ్స్‌ను నిర్మాణం పట్ల ముఖ్యమంత్రి ప్రత్యేక చొరవ చూపిస్తున్నారు. అతి త్వరలో ఈ ఆసుపత్రి ప్రజలకు అందుబాటులోకి వచ్చేలా చూస్తా

మహిళా భవన్‌ల ఏర్పాటు

నిరుపేదలు అధిక సంఖ్యలో ఉన్న కంటోన్మెంట్‌లో మహిళా సాధికారితకు ప్రాధాన్యం ఇవ్వాల్సిన అవసరం ఎంతైనా ఉంది. మహిళా సంఘాలకు అందజేస్తున్న రుణాలకు తోడు స్వయం ఉపాధి దిశగా శిక్షణ కేంద్రాలను ఏర్పాటు చేయాల్సి ఉంది. శ్రీగణేశ్ ఫౌండేషన్ ద్వారా ఇప్పటికే వేలాది మందికి వివిధ రంగాల్లో ఉచిత నైపుణ్యాభివృద్ధి శిక్షణ ఇప్పించా. ప్రభుత్వ సహకారంతో ఈ శిక్షణను మరింత విస్తృతం చేస్తాం.

మైదానాల అభివృద్ధిపై దృష్టి

ఎందరో జాతీయ, అంతర్జాతీయ క్రీడాకారులు ఉన్న కంటోన్మెంట్‌లో సరైన క్రీడా మైదానాలు లేవు. ఏళ్ల తరబడి మినీ స్టేడియాల ఏర్పాటు ప్రకటన మినహా ఒక్క అడుగు కూడా ముందుకు పడలేదు. త్వరలోనే ప్రతిపాదిత మినీ స్టేడియాలతో పాటు అన్ని వార్డుల పరిధిలో క్రీడామైదానాలను యువతకు అందుబాటులోకి తెస్తా.

విద్యాశాఖ మంత్రిని నియమించాలి



సమావేశంలో మాట్లాడుతున్న భాగ్యలక్ష్మి

అడ్డగుట్ట: ప్రభుత్వం వెంటనే విద్యాశాఖ మంత్రిని నియమించాలని తల్లుల సంఘం రాష్ట్ర కన్వీనర్ భాగ్యలక్ష్మి డిమాండ్ చేశారు. డివిజన్‌లోని బాబు జగ్జీవన్‌రామ్ భవనంలో బుధవారం నిర్వహించిన సంఘం మండల సమావేశంలో ఆమె మాట్లాడారు. మండలంలో బడిబాట కార్యక్రమం కొనసాగుతున్నప్పటికీ మారేడుపల్లి మండల పరిధిలో ఇంకా 159 మంది పిల్లలు బడికి దూరంగా ఉన్నారన్నారు. వారిని పనుల నుంచి విముక్తి చేసి బడికి పంపే బాధ్యత విద్యాశాఖపై ఉందన్నారు. అమ్మ ఆదర్శ పాఠశాల నియామకంపై అసంతృప్తి వ్యక్తం చేస్తున్నామన్నారు. మహిళలను కోటీశ్వరులు చేయాలనుకుంటే కాంట్రాక్టులు, కుటీర పరిశ్రమల ఏర్పాటు చేయాలని, చట్టబద్ధత కలిగిన పిల్లల తల్లిదండ్రులను స్కూల్ కమిటీ చైర్మన్‌గా నియమించాలని డిమాండ్ చేశారు. దేశంలోనే మన విద్యా వ్యవస్థ 35వ స్థానంలో ఉందన్నారు. ఇకనైనా ప్రభుత్వ పాఠశాలలో ఫీజుల దోపిడీని అరికట్టాలంటే రాష్ట్రంలో తక్షణమే విద్యాశాఖ మంత్రిని నియమించాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో ఎంవీ ఫౌండేషన్ కోఆర్డినేటర్ ఏవీఎం స్వామి, లక్ష్మీనారాయణ, జమున, రమాదేవి, స్వరూప, విజయ, షీలా, శశికళ, కౌసల్య, సువర్ణ, భాగ్య, సుమలత, లావణ్య, సౌజన్య పాల్గొన్నారు.

విద్యా సమస్యలు ఎవరికి చెప్పుకోవాలి..



విఘ్నేష్

అడ్డగుట్ట: తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి దాదాపు ఆరు నెలలు గడుస్తున్నా విద్యాశాఖ మంత్రిని నియమించకపోవడం ప్రభుత్వ అసమర్థత అని ఎస్ఎఫ్ఐ హైదరాబాద్ జిల్లా ఉపాధ్యక్షుడు విఘ్నేష్ ఓ ప్రకటనలో పేర్కొన్నారు. విద్యా విభాగం రాష్ట్ర ప్రభుత్వంలో అత్యంత ముఖ్యమైనదని విద్యాశాఖ మంత్రి నియామకం లేకపోవడంతో ప్రభుత్వ విద్యాసంస్థల్లో అధ్యాపకుల నియామకాలు ఇతర సమస్యలు ఎవరికి చెప్పుకోవాలో తెలియక విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. గత ప్రభుత్వంలో కూడా విద్యకు సంబంధించి అనేక సమస్యలు ఎదురయ్యాయని, స్కాలర్‌షిప్, రీయింబర్స్‌మెంట్స్ బకాయిలు ఇప్పటికీ పెండింగ్‌లోనే ఉన్నాయన్నారు. ఈ విషయాలను గత ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లినా ఫలితం లేకుండాపోయిందని, ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వమైనా సమస్యల పరిష్కారం కోసం కృషి చేయాలని, అదే విధంగా ప్రభుత్వ జూనియర్ కాలేజీల్లో మధ్యాహ్న భోజనం పథకం అమలు చేయాలని డిమాండ్ చేశారు.

ఇళ్ల విషయంలో న్యాయం చేస్తానని కలెక్టర్ హామీ

లష్కర్ జిల్లా సాధన సమితి అధ్యక్షుడు పవన్ కుమార్ గౌడ్



కలెక్టర్ అనుదీప్‌తో సమావేశమైన సమితి సభ్యులు

సికింద్రాబాద్: నియోజకవర్గంలోని హమాలీ బస్తీలో పెండింగ్‌లో ఉన్న 60 మంది లబ్ధిదారులకు ఇళ్ల కేటాయింపు విషయంలో తగు న్యాయం చేస్తామని హైదరాబాద్ జిల్లా కలెక్టర్ అనుదీప్ లష్కర్ జిల్లా సాధన సమితికి హామీ ఇచ్చినట్లు సమితి అధ్యక్షుడు గుర్రం పవన్‌కుమార్ తెలిపారు. హమాలీ బస్తీ గృహ నిర్మాణం పరిరక్షణ కమిటీ సభ్యులు ఇళ్ల కేటాయింపు విషయంలో మద్దతు తెలపాలని కోరుతూ ఇటీవల లష్కర్ సాధన సమితి ప్రతినిధులను కలిసిన విషయం తెలిసిందే. ఈ మేరకు సమితి అధ్యక్షుడు గుర్రం పవన్ కుమార్ గౌడ్ బస్తీ వాసులతో కలిసి జిల్లా కలెక్టర్‌ను కలిశారు. గత పదేళ్లుగా 60 కుటుంబాలకు ఇళ్లు కేటాయించకపోవడంతో అనేక ఇబ్బందులు పడుతున్నారని కలెక్టర్ దృష్టికి తీసుకురాగా బస్తీవాసులకు తగు న్యాయం చేసే విధంగా చర్యలు తీసుకుంటామని కలెక్టర్ హామీ ఇచ్చినట్లు తెలిపారు. కలెక్టర్‌ను కలిసిన వారిలో బస్తీ వాసులు రవి, నర్సింగ్‌రావు, సమితి సభ్యులు సుబ్బారావు, కృష్ణ ముదిరాజ్, అశోక్ చారి, అజిత్, సాగర్ ఉన్నారు.

పెండింగ్ పనులు పూర్తి చేయాలి



సికింద్రాబాద్: డివిజన్‌లో ఉన్న పెండింగ్ పనులు త్వరగా పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని సీతాఫల్‌మండి కార్పొరేటర్ సామల పేర్కొన్నారు. సికింద్రాబాద్‌లోని జీహెచ్‌ఎంసీ కార్యాలయంలో బుధవారం ఆమె పలువురు అధికారులతో సమావేశమై వేంకటేశ్వరనగర్, మార్కండేయనగర్‌లలో ఎన్నికల సందర్భంగా సీసీ రోడ్డు ప్రతిపాదనలు రద్దు కావడంతో వాటిని మళ్లీ రీటెండరింగ్ చేసి మంజూరు చేయాలని కోరారు. భవానినగర్, శాబాజ్‌గూడ, ఇందిరానగర్ ప్రాంతాల్లో నూతన సీసీ రోడ్లు మంజూరు చేసి పనులను త్వరగా ప్రారంభించాలని కోరారు. ఇందిరానగర్ స్ట్రాం వాటర్ కోసం బాక్స్ డ్రెయిన్ పనులు రూ.1.2 కోట్లతో చేపడుతున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్ఈ అనిల్‌రాజ్, ఏఈ కౌశిక్, కార్పొరేటర్ కంది శైలజ పాల్గొన్నారు. అనంతరం అధికారులతో కలిసి బ్రాహ్మణ బస్తీలో పర్యటించారు. డ్రైనేజీ పైప్‌లైన్లలో చెత్తా చెదారం చేరడంతో డ్రైనేజీ ఓవర్ ఫ్లో అవుతుందని స్థానికులు ఆమె దృష్టికి తీసుకురాగా కొత్త మ్యాన్‌హోళ్లు నిర్మించి సమస్యను పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు.

గాంధీలో కొనసాగుతున్న మోతీలాల్ ఆమరణదీక్ష



మోతీలాల్‌నాయక్‌ను పరామర్శిస్తున్న బర్రెలక్క, నిరుద్యోగ సంఘ ప్రతినిధులు

గాంధీఆస్పత్రి: నిరుద్యోగ జేఏసీ నాయకుడు మోతీలాల్‌నాయక్ చేపట్టిన ఆమరణదీక్ష మూడో రోజైన బుధవారం గాంధీఆస్పత్రిలో కొనసాగింది. రాష్ట్రంలో ఖాళీగా ఉన్న ఉద్యోగాలపై శ్వేత పత్రం విడుదల, గ్రూప్ 2, 3 పోస్టుల సంఖ్య పెంచి పరీక్షలు నిర్వహణ, ఉద్యోగ ఖాళీలు భర్తీ, మెగా డీఎస్సీ, తదితర డిమాండ్లతో ఉస్మానియా యూనివర్సిటీ క్యాంపస్‌లో మోతీలాల్‌నాయక్ ఆమరణ నిరాహార దీక్ష చేపట్టిన సంగతి విదితమే. నిరాహారదీక్షను భగ్నం చేసిన పోలీసులు నాయక్‌ను ఉస్మానియా ఆస్పత్రికి తరలించి, అక్కడి నుంచి మంగళవారం రాత్రి సికింద్రాబాద్ గాంధీ ఆస్పత్రిలో చేర్పించారు. తమ డిమాండ్లు పరిష్కరించే వరకూ ఆమరణ దీక్ష కొనసాగిస్తానని మోతీలాల్‌నాయక్ స్పష్టం చేశారు. గాంధీఆస్పత్రిలో ఉన్న ఆయనను కర్నె శిరీషా అలియాస్ బర్రెలక్కతో పాటు పలువురు జేఏసీ నాయకులు, వివిధ జిల్లాల నుంచి వచ్చిన నిరుద్యోగ సంఘ ప్రతినిధులు పరామర్శించారు. మోతీలాల్‌నాయక్ ప్రాణాలకు ప్రమాదం జరిగితే ప్రభుత్వమే బాధ్యత వహించాలని హెచ్చరించారు.

'డ్రగ్స్ ఫ్రీ సొసైటీ'కి కృషి చేయాలి



అవగాహన కల్పిస్తున్న ఏసీపీ జగన్

లాలాపేట: డ్రగ్స్ ఫ్రీ సొసైటీ నిర్మాణానికి అందరూ కృషి చేయాలని ఓయూ ఏసీపీ జగన్ అన్నారు. ఉస్మానియా యూనివర్సిటీ పోలీసు స్టేషన్ ఆధ్వర్యంలో బుధవారం పార్థివాడ రవీంద్రనగర్‌లో మాదక ద్రవ్యాల నివారణపై నిర్వహించిన అవగాహన సదస్సులో ఏసీపీ జగన్ పాల్గొని డ్రగ్స్ వినియోగంతో కలిగే దుష్పరిణామాలను వివరించారు. యువత వాటి జోలికి వెళ్లొద్దని సూచించారు. చట్టల్లో ఉన్న కఠిన శిక్షలను వివరించారు. అసాంఘిక కార్యకలాపాలకు ఎవరూ పాల్పడవద్దని సూచించారు.స్థానికులందరితో ప్రమాణం చేయించారు. ఈ కార్యక్రమంలో ఇన్‌స్పెక్టర్ రాజేందర్, ఎస్సై నరేష్, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు,



లాలాపేటలో ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

అప్సా సంస్థ ఆధ్వర్యంలో ర్యాలీ..

లాలాపేట: అంతర్జాతీయ మాదక ద్రవ్యాల దుర్వినియోగం దినోత్సవాన్ని పురస్కరించుకుని అప్సా సంస్థ ఆధ్వర్యంలో బుధవారం తార్నాక డివిజన్ లాలాపేటలో ర్యాలీ నిర్వహించారు. ప్రొ జయశంకర్ స్టేడియం నుంచి డా. బీఆర్ అంబేడ్కర్ విగ్రహం వరకు కొనసాగిన ర్యాలీలో సే నో డ్రగ్స్, మాదక ద్రవ్యాల నివారణ అందరి బాధ్యత అంటూ నినాదాలు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. రోజు రోజుకు యువత మాదక ద్రవ్యాలకు బానిసలుగా మారుతున్నారని ప్రభుత్వం మరింతగా పటిష్టమైన చర్యలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో సంస్థ ప్రతినిధులు బస్వరాజ్, మంజుల, శ్రీలత పాల్గొన్నారు.